# ఓం శ్రీ గణేశాయనమః

"శుక్లాంబర ధరం విష్ణుం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే"

విఘ్నేశ్వరపూజ చేయకుండా పాల సముద్ర మథనం జరగటం వలన, దానికి విఘ్నం కలిగింది. అప్పుడు శ్రీ విష్ణుమూర్తి స్వయముగా, దేవతలకు, విఘ్నేశ్వరుని మహిమ తెలిపి, వారిచేత పూజ చేయించిన తరువాతనే దేవతలకు అమృతము దొరికినది. అందులకే గణపతి దేవతలకు కూడా ఆరాధ్య దేవుడు.



"త్వం మూలాధారే స్థితోసి" అని గణపతి అధర్వశీర్షము చెప్పుచున్నది. మంత్ర శాస్త్రములో గణపతులు ముప్పది రెండు రూపములతో చెప్పబడినది. అంతేకాక దేశకాల భేదముతో సకల శుభములు కలుగజేయుటకు అష్టైశ్వర్యములతో తులతూగుటకు, ఈతి, దుఃఖబాధలు కలుగ కుండుటకు, విద్య, శక్తి, ధైర్యము మొదలైన సమస్త సుఖములు సంప్రాప్తించుటకు విఘ్నేశ్వరుని వివిధ రూపములలో సేవించుచున్నాము. గణపతి ఆత్మ స్వరూపుడు. సృష్టి కల్పమున 16, ప్రళయ కల్పమున 16 కలిసి 32 కళలు. అందుచేత గణపతి చంధోగణపతియై 32 కళలతో అలరారుచుండును.

గణపతి "హస్తముఖుడు" అని చెప్పబడినస్వామి. గణపతి మూర్తి హస్త నక్షత్రా ముఖమున కనిపించును. హస్తానక్షత్రం చేతి వేళ్ళ వలెను "హస్తా" కారం ఆకారం కల నక్షత్రము. హస్తి అనగా ఏనుగని అర్థం. ఇందుకు జ్యోతి శాస్త్రము కలదు. భాద్రపద మాసమున శుద్ధ చతుర్థినాడు చంద్రోదయం సమయమున ఆకాశమున "హస్తా నక్షత్ర" ముఖమున దర్శన మిచ్చును. అదే సమయమున "వినాయక చవితి"గా ఋషులు నిర్ణయించిరి. ఈ హస్తా నక్షత్రము కన్యారాశి యందుకలదు. కన్య అనగా నిత్యము వివాహము కానిది. అందులకే గణపతి నిత్య బ్రహ్మచారిగా చెప్పబడి వున్నాడు.

కన్యా రాశికి 'బుధుడు' అధిపతి. బుధుని రంగు పచ్చ. అందుచేత గణపతిని ఆకు పచ్చని పత్రితో పూజిస్తారు. బుధునికి అధిష్టాన దేవత విష్ణుమూర్తి. అందువలనే గణపతిని విష్ణు స్వరూపుడని స్తుతించారు. "శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం"

వినాయక చవితి సమయమునకు భూమి అంతా ఆకు పచ్చగా వుంటుంది. మారేడు, వెలగపండ్లు, శీతాఫలములు, జామపండ్లు మొదలైనవి లభించును.

కన్యారాశి రంగు పచ్చ. "దుర్వాశ్యామః" అని వరహ మిహిరుడు బుధుని వర్ణించెను. అంతేకాక గణపతికి ప్రియమైనది, 'దుర్వాంకురము'

ఆకాశంలో "మఖా నక్షత్రము" నకు ఉత్తరముగా సప్తః మండలంలోని మొదట రెండు నక్షత్రాలకు ముందుగా వినాయక మండలం వుంది. ఈ నక్షత్రాలు కూడా భాద్రపద శుద్ధ చవితి నాడు ఉదయిస్తాయి. ఈ నక్షత్రాల ఆకృతిని కలిపితే వినాయకుని రూపం వస్తుంది. ఈ నక్షత్రాలు ఉదయించినప్పుడే వినాయక పూజ చేయాలని ''ధర్మసింధు''లో నిర్దేశమయినది. ఈ నక్షత్రాలలోనే మూషిక ఆకృతి గల నక్షత్రాలు కూడా కలవు.

మధ్యలో "ఆశ్లేష" నక్షత్ర మండలం వున్నది. ఆశ్లేష సర్వదైవత్వం కారణం వల్ల వినాయకుడు సర్వయజ్ఞోపవీతమును ధరించును. ఋషి పంచమినాడు కూడా ఈ రెండు నక్షత్రాలు తూర్పున ఉదయించును.

భాద్రపద శుద్ధ చవితినాడు, గణేశ పూజ చేయాలని పెద్దలు, శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

బుధ, కుజుల దోష సంయోగ ఫలము వలనే జాతకములో గణపతి దోషంగా చెప్పబడినది. అది నివారించుటకు గణపతిని పూజించవలెను.

విఘ్నేశ్వరుడు మూలాధార నివాసుడు. మూలాధారము శక్తినివాసము. అనగా 'కుండలినీ శక్తి' మూడున్నర చుట్టలు చుట్టుకొని సర్పరూపమున యున్నది. యోగకేంద్రము కనుక విఘ్నేశ్వరుడు జగన్మాతయైన శక్తికి కావలి యున్నవాడని పురాణములలో రహస్య సంకేతము. అతడు ఈ కుండలినీ శక్తిని సర్పరూపిణియైన దానిని ధరించి యుండుటచేత, 'నాగయజ్ఞోపవీతము' గలవాడని వ్యాసులవారు అతిగమ్యమైన దేవరహస్యమును తెలిపెను.

పూర్వం ఆశ్రమాలలో విద్యాభ్యాసము వినాయక చవితి